## 15 ఏండ్లలో 104 శాతం

**లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన పోటీ చేసే పార్టీల సంఖ్య • మహిళా అభ్యర్థులు కూడా 7 నుంచి 9.6 శాతానికి**

న్యూఢిల్లీ: ఏండ్లు గడిచే కొద్దీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తే రాజకీయ పార్టీలు, మహిళా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన పార్టీల సంఖ్య 2009తో పోలిస్తే 2024 నాటికి 104 శాతం పెరిగిందని ది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషణ వెల్లడించింది. అదేవిధంగా మహిళా అభ్యర్థు సంఖ్య కూడా 7 నుంచి 9 శాతానికి చేరిందని పేర్కొన్నది.

**లోక్‌సభ బరిలో పార్టీలు**

2009-368
2014-464
2019-677
2024-751

**మహిళా అభ్యర్థుల సంఖ్య**

2009- 556 (7 శాతం)
2014- 640 (8 శాతం)
2019- 716 (9 శాతం)
2024- 797 (9.6 శాతం)

## పట్నాయక్ ఆరోగ్యంపై పరేషాన్?

- ఒడిశా సీఎం ఆరోగ్యంపై ప్రజల్లో చర్చ
- రోజుకో వీడియో వైరల్ చేస్తున్న బీజేపీ
- పాండియన్ చేతుల్లో నవీన్ ఉన్నారని ఆరోపణ
- ఆరోగ్యం క్షీణించడంపై కమిటీ వేసి దర్యాప్తు చేయిస్తామన్న మోదీ
- తాను ఆరోగ్యంగానే ఉన్నానన్న సీఎం



భువనేశ్వర్, మే 29: లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ఒడిశాలో సీఎం నవీన్ పట్నాయక్ ఆరోగ్యం రాజకీయ అంశంగా మారింది. నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై బీజేపీ రోజుకో వీడియో విడుదల చేస్తూ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటున్నది. పట్నాయక్ అనారోగ్యంతో ఉన్నారని, ఆయన ప్రభుత్వాన్ని నడపలేరనే భావనను ప్రజల్లో కల్పించేందుకు ప్రయత్నిస్తున్నది. పట్నాయక్‌కు ఆంతరంగికుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి, ప్రస్తుత బిజూ జనతాదళ్ ముఖ్యనేత వీకే పాండియన్‌ను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటున్నది. పట్నాయక్ అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకొని పాండియన్.. పాలనను తన ఆధీనంలోకి తీసుకున్నారని, పట్నాయక్‌ను కంట్రోల్ చేస్తున్నారని బీజేపీ ఆరోపిస్తున్నది. మరోవైపు తాను ఆరోగ్యంగా ఉన్నానని నవీన్ పట్నాయక్ చెప్తున్నారు. దీంతో ప్రజల్లో పట్నాయక్ ఆరోగ్యంపై గందరగోళం నెలకొన్నది.

**వైరల్‌గా మారిన వీడియోలు**

నవీన్ పట్నాయక్ ఓ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న వీడియోను బీజేపీ మంగళవారం వైరల్ చేసింది. ఇందులో పట్నాయక్ మాట్లాడుతుండగా పాండియన్ మైక్ పట్టుకున్నారు. వణుకుతున్న పట్నాయక్ చేతిని పాండియన్ దాచేస్తున్నట్టుగా ఈ వీడియో ఉంది. బుధవారం మరో వీడియోను బీజేపీ నేత, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ షేర్ చేశారు. ఓ ఎన్నికల సభలో నవీన్ పట్నాయక్ కాలిని తన కాలితో పాండియన్ జరుపుతున్నట్టుగా ఈ వీడియోలో అస్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో ఈ రెండు వీడియోలు వైరల్‌గా మారాయి.

**బీజేపీకి ఎన్నికల ప్రచారాస్త్రం**

ఒడిశాలో ఈసారి అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉన్న బీజేపీ.. నవీన్ పట్నాయక్ ఆరోగ్యాన్ని ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నది. ఆయన ఆరోసారి అధికారంలోకి వచ్చినా ప్రభుత్వాన్ని నడిపించలేరని, తమిళనాడుకు చెందిన పాండియన్.. అనధికారికంగా ప్రభుత్వాన్ని నడిపిస్తారనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నది. పాండియన్ తమిళుడు కావడంతో, ఒడిశా గొప్పదనాన్ని కాపాడుకుందాం అంటూ పదేపదే బీజేపీ.. ప్రజలకు పిలుపునిస్తున్నది. ఒడిశా పాలన వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి చేతుల్లోకి వెళ్లొద్దనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్తున్నది.

### నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై కమిటీ వేస్తాం: మోదీ

ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వస్తే పట్నాయక్ ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించడంపై ప్రత్యేక కమిటీ వేసి దర్యాప్తు జరిపిస్తామని ప్రధాని మోదీ ఓ సభలో ప్రకటించారు. ఆయన ఆరోగ్యం రోజురోజుకూ దిగజారడంలో కుట్ర దాగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పట్నాయక్ స్పందిస్తూ.. లేనిపోని అంశాలను ప్రస్తావించడం బీజేపీకి అలవాటేనని విమర్శించారు. తన ఆరోగ్యంపై బీజేపీ పుకార్లు సృష్టిస్తున్నదని, తాను ఆరోగ్యంగా ఉన్నానని, ప్రచారం కూడా చేస్తున్నానన్నారు.

# కాంగ్రెస్‌తో దోస్తీ శాశ్వతం కాదు

- బీజేపీని ఓడించడానికే వాళ్లతో జట్టుకట్టాం
- కమలం ఉనికి లేనిచోట కాంగ్రెస్‌తోనే మా పోటీ
- మూడోసారి మోదీ వస్తే, దేశంలో పుతిన్ రాజ్యమే
- యూపీ సీఎం యోగి రాజకీయ భవిష్యత్తు ఖతమే
- ఢిల్లీ సీఎం, ఆప్ నేత కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌తో తమ బంధం శాశ్వతమైనదేమీ కాదని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికే కాంగ్రెస్‌తో తాము జట్టు కట్టినట్టు స్పష్టం చేశారు. ఈ మేరకు జాతీయ మీడియా 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఢిల్లీలో దోస్తీ.. పంజాబ్‌లో కుస్తీ**

'కాంగ్రెస్‌తో ఆప్‌ది శాశ్వతమైన వివాహ బంధమేమీ కాదు. బీజేపీపాలనలో ప్రస్తుతం దేశంలో నియంతృత్వం, గూండాగిరీ రాజ్యమేలుతున్నాయి. వీటికి చరమగీతం పాడాలి. ఇది జరుగాలంటే బీజేపీని ఓడించాలి. అందుకే కాంగ్రెస్‌తో జట్టుకట్టాం' అని కేజ్రీవాల్ అన్నారు. కొన్ని రాష్ర్టాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టిన ఆప్, పంజాబ్ తదితర రాష్ర్టాల్లో సొంతంగా బరిలోకి దిగడంపై కూడా ఆయన స్పందించారు. 'దేశాన్ని కాపాడటం ప్రస్తుతం ఎంతో ముఖ్యం. ఇందులో భాగంగానే బీజేపీని ఓడించడానికి అవసరమైన చోట ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాయి. పంజాబ్‌లో బీజేపీ ఉనికే లేదు' అని పేర్కొన్న కేజ్రీవాల్.. అలాంటి సమయంలో కాంగ్రెస్‌తోనే తమకు పోటీ అని పరోక్షంగా బదులిచ్చారు.



**సీఎంగా దిగే ప్రసక్తే లేదు**

ఢిల్లీ సీఎం పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని కేజ్రీవాల్ ఈ సందర్భంగా తేల్చి చెప్పారు. మద్యం పాలసీ కేసు విషయమై ఆయన స్పందిస్తూ.. 'నేను తిరిగి జైలుకు వెళ్తానా? లేదా? అనేది ఇక్కడ సమస్య కాదు. ప్రస్తుతం దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడిపోయింది. వాళ్లు (బీజేపీ) ఎంత కాలం నన్ను జైల్లో పెట్టాలనుకొంటున్నారో.. పెట్టనివ్వండి. నేను నా ధైర్యాన్ని కోల్పోను. బీజేపీ కోరుకొంటున్నట్టు.. ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేయబోను' అని పేర్కొన్నారు.

**బీజేపీ గెలిస్తే ఇక అంతే**

మూడోసారి మోదీ అధికారంలోకి వస్తే, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖ నేతలను బీజేపీ జైల్లో పెడుతుందని కేజ్రీవాల్ ఆరోపించారు. వ్లాదిమిర్ పుతిన్ పాలనలో రష్యాలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో.. ఇక్కడ కూడా అవే పునరావృతమవుతాయన్నారు. బీజేపీలో చేరితే బెయిల్ ఇప్పిస్తామని ఆప్ నేతలు సత్యేందర్ జైన్, మనీశ్ సిసోడియాకు ఆ పార్టీ నేతలు ఆశ చూపించారని మండిపడ్డారు.

### కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తనకు మంజూరైన మధ్యంతర బెయిలును మరో వారం రోజులపాటు పొడిగించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా లిస్టింగ్ చేసేందుకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. రెగ్యులర్ బెయిలు కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించేందుకు కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు స్వేచ్ఛనిచ్చిందని, అందువల్ల ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని వివరించింది.

**యోగి భవిష్యత్తు ఖతం**

బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే, ప్రధాని మోదీ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ భవిష్యత్తుకు ముగింపు పలుకుతారని కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. 'నేను గతంలో చెప్పిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నా. ఈసారి పీఎంగా మోదీ మళ్లీ ఎన్నికైతే, యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితం డోలాయమానంలో పడుతుంది. నేను చెప్పింది తప్పని బీజేపీ నేతలను చెప్పమనండి?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాగా.. ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ వివాదంపై మాట్లాడటానికి కేజ్రీవాల్ నిరాకరించారు.

## చైనా ఆక్రమణ అనేది 'ఆరోపణ'

- 1962 భారత్ - చైనా యుద్ధంపై కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్



న్యూఢిల్లీ, మే 29: కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1962లో జరిగిన భారత్ – చైనా యుద్ధంపై ఆయన మాట్లాడుతూ... '1962 అక్టోబర్‌లో భారత్‌పై చైనా బలగాలు దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి' అని వ్యాఖ్యానించారు. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిన విషయం తెలిసినప్పటికీ ఇలా 'ఆరోపణ ఉన్నట్టుగా' అంటూ అయ్యర్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ భారత వ్యతిరేక వైఖరికి అయ్యర్ వ్యాఖ్యలే నిదర్శనమని బీజేపీ మండిపడింది.

**పొరపాటున 'ఆరోపణ' పదం వచ్చింది: అయ్యర్ క్షమాపణలు**

తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో మణిశంకర్ అయ్యర్ క్షమాపణలు చెప్పారు. తన ప్రసంగంలో పొరపాటున 'ఆరోపణ' అనే పదం పలికానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు అయ్యర్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఇబ్బందుల్లో పడింది. 1962 అక్టోబరు 20న భారత్‌లో చైనా ఆక్రమణ నిజమని, అలాగే 2020 మేలో లఢక్‌లో చైనా చొరబాటు కూడా నిజమని, 20 మంది భారత సైనికులు అమరులయ్యారనేది నిజమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, మణిశంకర్ అయ్యర్ తరచూ చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారుతున్నాయి. ఇటీవల ఆయన ఓ సందర్భంగా మాట్లాడుతూ... 'పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉన్నందున భారత్ ఆ దేశాన్ని గౌరవించాలని, లేకపోతే భారత్‌పై అణుబాంబును ఉపయోగించే అంశాన్ని పాక్ ఆలోచిస్తుంది' అని అయ్యర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## బెంగాల్‌లో సీఏఏ అమలు

**ఉత్తరాఖండ్, హర్యానాలోనూ..**

న్యూఢిల్లీ, మే 29: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును కేంద్రం పశ్చిమబెంగాల్‌లో ప్రారంభించింది. బెంగాల్‌తో పాటు హర్యానా, ఉత్తరాఖండ్‌ల్లో కొందరు వలసదారులకు పౌరసత్వాన్ని మంజూరు చేసినట్టు కేంద్ర హోంశాఖ తెలిపింది. తమ రాష్ట్రంలో సీఏఏను అమలు చేయబోనీయమంటూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఓ పక్క ఎన్నికల ప్రచారంలో పేర్కొంటుండగా, అమలు కాకుండా ఎవరూ అడ్డుకోలేరని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొంటూ వచ్చారు. మొదటి విడత పౌరసత్వ సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మే 15న అందజేసింది. కాగా, ఆఖరి విడత ఎన్నికలు జరిగే జూన్ 1కి మూడు రోజుల ముందు బుధవారం రెండో విడత సర్టిఫికెట్లను కూడా అందజేశారు. ఈ ఏడో విడతలో బెంగాల్‌లోని పలు నియోజకవర్గాల్లో ఎన్నిక జరగనున్నది.

## ప్రజ్వల్ అరెస్టుకు రంగం సిద్ధం!

**బెంగళూరులో ల్యాండవగానే అదుపులోకి**

బెంగళూరు, మే 29: మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటకలోని హసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పెట్టుకొన్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు బుధవారం తిరస్కరించింది. ఆయన జర్మనీలోని మునిచ్ నుంచి బెంగళూరుకు గురువారం విమాన టికెట్‌ను బుక్ చేసుకొన్నట్టు తెలుస్తున్నది. శుక్రవారం తెల్లవారుజామున ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరులో ల్యాండ్ అవగానే.. విమానాశ్రయంలోనే అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కెంపెగౌడ విమానాశ్రమంలో సిట్ అధికారులు నిఘా ఏర్పాటు చేశారు.

## బర్డ్‌ఫ్లూతో అమెరికాలో 40 లక్షల కోళ్ల హననం

వాషింగ్టన్, మే 29: అమెరికాలో బర్డ్‌ఫ్లూ విజృంభిస్తున్నది. ఈ వ్యాధి కారణంగా ఐయోవాలోని సియోక్స్ కౌంటీలో రైతులు 40 లక్షల కోళ్లను హననం చేయనున్నారు. 2022 తర్వాత ఇంత తీవ్ర స్థాయిలో బర్డ్ ఫ్లూ వ్యాపించడం ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు. ఐయోవాలో తొలిసారిగా డిసెంబర్‌లో ఈ వ్యాధి వ్యాప్తిని గమనించారు. అమెరికాలో మొత్తం గుడ్లు, చికెన్ ఉత్పత్తిలో 12 శాతం ఇక్కడి నుంచే వస్తుంది.

## రుద్ర పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, మే 29: గగనతలం నుంచి భూతలంపై లక్ష్యాల్ని ఛేదించగల రుద్ర క్షిపణి ప్రయోగాన్ని భారత్ బుధవారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్–30 ఫైటర్ జెట్ నుంచి చేపట్టిన రుద్ర క్షిపణి ప్రయోగం సక్సెస్ అయినట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో డీఆర్‌డీవో సైంటిస్టులు 'రుద్ర ఎం–2' క్షిపణిని తయారుచేశారు.

## టగ్ ఆఫ్ వార్.. చైనాపై భారత్ సైనికులదే పైచేయి

న్యూఢిల్లీ, మే 29: ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షణ దళంగా సూడాన్‌లో ఉన్న భారత సైనికులు.. స్నేహపూర్వకంగా జరిగిన 'టగ్ ఆఫ్ వార్' ఆటలో తమ సత్తా చాటాను. చైనా సైనికులను ఓడించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోను భారత ఆర్మీ అధికారులు కూడా ధ్రువీకరించారు. సూడాన్‌లో శాంతి పరిరక్షణ నిమిత్తం వెళ్లిన భారత్, చైనా సైనికులు స్నేహపూర్వకంగా టగ్ ఆఫ్ వార్ ఆటను ఆడారు.

## 'ది రీడర్స్ డైజెస్ట్' మూత!

లండన్: పుస్తక పఠనం పట్ల ఆసక్తిగలవారందరికీ ఏప్రిల్ 30 అత్యంత విచారకరమైన రోజు. అనేక మందికి విజ్ఞానాన్ని పంచి, స్ఫూర్తి, ప్రేరణలనిచ్చిన 'ది రీడర్స్ డైజెస్ట్' ముద్రణ ఎడిషన్ అదే రోజున మూతపడింది. ఈ వార్తను తెలియజేస్తూ ఈ మ్యాగజైన్ ఎడిటర్–ఇన్–చీఫ్ ఎవా మకెవిక్ ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో అంతర్జాతీయ పుస్తక దినోత్సవంనాడు విడుదల కావడం గమనార్హం.

## వాహనదారులపైకి బ్రిజ్‌భూషణ్ కుమారుడి కాన్వాయ్

**ఇద్దరు మృతి..**

లక్నో, మే 29: బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ కుటుంబం మరో వివాదంలో చిక్కుకుంది. ఆయన కుమారుడు, కైసర్‌గంజ్ స్థానం బీజేపీ అభ్యర్థి కరణ్‌సింగ్ వాహన కాన్వాయ్ మోటార్ సైకిల్‌పైకి దూసుకెళ్లగా.. ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండా నగర సమీపంలోని రహదారిపై బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోటార్ సైకిల్‌పై వస్తున్న రెహాన్ ఖాన్(17), షెహజాద్ ఖాన్ (20) ఇద్దరిని ఎస్‌యూవీ కారు ఢీకొనటంతో, వారిద్దరు ప్రాణాలు కోల్పోయారని కెర్నాల్‌గంజ్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.ప్రమాదంలో 60 ఏండ్ల మహిళ కూడా గాయపడింది.



## ఉత్తర కొరియా 'చెత్త' దాడి

సియోల్, మే 29: పొరుగున ఉన్న దక్షిణ కొరియాపై ఉత్తర కొరియా 'చెత్త' దాడికి పాల్పడింది. పెద్దయెత్తున చెత్త, ఇతర విసర్జకాలతో ఉన్న మూటలతో కూడిన బెలూన్లను సరిహద్దు వెంబడి ఎగురవేసి దక్షిణ కొరియా గగనతలంలోకి పంపింది. ఈ చర్యను దక్షిణ కొరియా తీవ్రంగా ఖండించింది. దీంతో ఆ దేశ మిలటరీ అధికారులు రంగంలోకి దిగి ఆ బెలూన్లను సేకరించడం ప్రారంభించారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోవద్దని ప్రజలకు అడ్వయిజరీ జారీ చేశారు. బుధవారం నాటికి 150 బెలూన్లను గుర్తించామన్నారు. అందులో చాలామటుకు నేలపై పడగా, మరికొన్ని గగనతలంలోనే విహరిస్తున్నట్టు స్థానిక మీడియా వెల్లడించింది.

# ఎండలకు తల్లడిల్లి 'ఢిల్లీ'

- నిప్పుల కుంపటిలా దేశ రాజధాని నగరం
- 52.3 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు
- దేశ చరిత్రలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత



న్యూఢిల్లీ, మే 29: ఢిల్లీలో దేశ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రత బుధవారం నమోదయ్యింది. నగరంలోని మంగేశ్‌పూర్ ప్రాంతంలో సాయంత్రం 4.14 గంటలకు 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయ్యిందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఇదే ప్రాంతంలో మంగళవారం 49.9 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా బుధవారం మరింత పెరిగింది. ఇప్పటివరకు ఢిల్లీతో పాటు మొత్తం దేశంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదేనని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఇంతకుముందు ఢిల్లీలో 2002లో అత్యధికంగా 49.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. రాజస్థాన్ నుంచి వస్తున్న వడగాడ్పుల వల్ల ఢిల్లీలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ రీజినల్ హెడ్ కుల్‌దీప్ శ్రీవాత్సవ తెలిపారు. ఎండవేడి తీవ్రంగా ఉండటంతో ఢిల్లీలో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

**సాయంత్రానికి భారీ వర్షం**

ఎండవేడికి తాళలేక ఢిల్లీ ప్రజలు ఇండ్లు, కార్యాలయాల్లో ఏసీల వినియోగం భారీగా పెంచేశారు. దీంతో ఢిల్లీలో బుధవారం విద్యుత్తు డిమాండ్ 8,302 మెగావాట్లకు చేరుకుంది.

**కార్మికులకు మూడు గంటల విరామం**

ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఢిల్లీ ఎల్జీ వీకే సక్సేనా కీలక ఆదేశాలు ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు వేతనంతో కూడిన విరామం ఇవ్వాలని ఆదేశించారు.

**సెన్సార్ ఎర్రర్ కావొచ్చు: ఐఎండీ**

ఢిల్లీలోని మంగేశ్‌పూర్ ప్రాంతంలో దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైన నేపథ్యంలో సంబంధిత డాటా కచ్చితత్వంపై పలు ప్రశ్నలు వస్తున్నాయి. ఉష్ణోగ్రత డాటాను పరిశీలిస్తున్నామని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) బుధవారం సాయంత్రం వెల్లడించింది. సెన్సార్ లేదా లోకల్ ఫ్యాక్టర్స్‌లో ఎర్రర్ కారణంగా ఇది జరిగి ఉండొచ్చని అభిప్రాయపడింది. డాటాను, సెన్సార్‌లను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. కాగా, ఢిల్లీలో అంత స్థాయిలో భారీ ఉష్ణోగ్రతలు ఉండకపోవచ్చని, దీన్ని వెరిఫై చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఐఎండీ అధికారులకు సూచించారు.

### ఎండల రికార్డులు బ్రేక్

ఢిల్లీలోని మంగేశ్‌పూర్‌లో బుధవారం నమోదైన 52.3 డిగ్రీల ఉష్ణోగ్రత గత రికార్డులను చెరిపేసింది. దేశంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదుకావడం ఇదే తొలిసారి. 2016 మే నెలలో రాజస్థాన్‌లో ఫలోడీలో 51 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యింది. ఇప్పటివరకు భారత్‌లో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే. అంతకుముందు 1956లోనూ రాజస్థాన్‌లోని అల్వార్‌లో 50.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది.

### నీరు వృథా చేస్తే 2 వేలు జరిమానా

ఎండల తీవ్రతతో ఢిల్లీలో నీటి కొరత మొదలయ్యింది. ఈ నేపథ్యంలో నీటి వృథాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇండ్లకు సరఫరా చేసే నీటితో వాహనాలు కడిగినా, నిర్మాణాలను ఉపయోగించినా, ఇతర పద్ధతుల్లో వృథా చేసినా రూ.2 వేల జరిమానా విధించనున్నట్టు అధికారులు ప్రకటించారు. నీటి వృథాను అరికట్టేందుకు గానూ 200 బృందాలను నియమించాలని ఢిల్లీ జల్ బోర్డును మంత్రి ఆతిశీ ఆదేశించారు.

## 1982 దాకా గాంధీ ఎవరో ప్రపంచానికి తెల్వదు!

> మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'గాంధీజీ చాలా గొప్ప వ్యక్తి. కానీ ఆయన గురించి ఎవరికీ తెలియదని చెబుతున్నందుకు నన్ను క్షమించండి. 1982లో ఆయనపై సినిమా తీసే వరకు గాంధీ గురించి ప్రపంచానికి తెలియదు. సినిమా తర్వాత అతను ఎవరనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రపంచం ఆసక్తి చూపింది. చేయాల్సిన పని మనం చేయలేదు. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా గురించి ప్రపంచానికి తెలిస్తే, మహాత్మా గాంధీ కూడా వారి కంటే తక్కువేమీ కాదు. ఈ విషయాన్ని అందరూ అంగీకరించాలి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తిరిగిన తర్వాత తాను ఈ విషయాన్ని చెబుతున్నానన్నారు. గాంధీజీ ద్వారా భారతదేశాన్ని గుర్తించాలని అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ జీవితం ఆధారంగా 1982లో 'గాంధీ' పేరుతో ఓ చిత్రం వచ్చింది. దీనికి రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వం వహించారు.

**గాంధీ వారసత్వాన్ని నాశనం చేస్తున్న మోదీ**

మోదీ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ మండిపడింది. దేవుడు ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకుంటున్నట్టు బుధవారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. 'గెట్ వెల్ సూన్' అంటూ మోదీతో కూడిన ఓ చిత్రాన్ని కూడా షేర్ చేసింది. గాంధీ వారసత్వాన్ని మోదీ నాశనం చేస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. మహాత్మాగాంధీ గురించి ప్రపంచానికి తెలియదని చెబుతున్న త్వరలో ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్న మోదీ.. ఆయన ఏ ప్రపంచంలో బతుకుతున్నారో తనకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. వారణాసి, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో గాంధీ పేరుతో ఉన్న సంస్థలను బీజేపీ సర్కారే నాశనం చేసిందని ఆరోపించారు. గాంధీని హత్య చేసిన గాడ్సే సైద్ధాంతిక వారసులు మహాత్మాగాంధీ చూపిన సత్యమార్గాన్ని అనుసరించలేరని అన్నారు. దేశానికి మోదీ లాంటి వ్యక్తి ప్రధాని కావడం దురదృష్టకరమని కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేథ్ విమర్శించారు.


## ఎల్వోసీ వెంబడి పాక్‌కు చైనా రక్షణ సాయం

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంబడి పాకిస్థాన్‌కు చైనా గత మూడేండ్లుగా రక్షణ సహాయాన్ని అందజేస్తున్నట్టు పీటీఐ వార్తాసంస్థ వెల్లడించింది. అందులో భాగంగా పాకిస్థాన్‌కు స్టీల్ హెడ్ బంకర్ల నిర్మాణంలో సహకరించడమే కాక, మానవ రహిత ఏరియల్ వాహనాలు, కాంబాట్ ఏరియల్ వెహికల్స్‌లను చైనా సరఫరా చేస్తున్నదని పేర్కొన్నది. ఇక కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్ఠతకు అత్యంత శక్తివంతమైన కమ్యూనికేషన్ టవర్ల నిర్మాణం, ఎల్వోసీ వెంబడి ఫైబర్ ఆప్టికల్ కేబుల్ లైన్లను కూడా నిర్మిస్తున్నదని తెలిపింది. మధ్య, స్వల్ప ఎత్తులలో లక్ష్యాలను గుర్తించే చైనా రాడార్ వ్యవస్థలో అధునాతన జేవై, హెచ్‌జీఆర్ సిరీస్ రాడార్ సిస్టమ్‌లను సైనిక, వాయు దళాలకు సరఫరా చేస్తున్నదని వెల్లడించింది.

# 'ఆల్ ఐస్ ఆన్ రఫా'

- రఫాలో ఇజ్రాయెల్ దాడిపై గళమెత్తిన నెటిజన్లు, సెలబ్రిటీలు
- బాధితులకు సంఘీభావంగా సోషల్ మీడియాలో పోస్టులు
- రఫాలోకి ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు
- అంతర్జాతీయంగా ఒత్తిడి వస్తున్నా వెనక్కి తగ్గని నెతన్యాహూ సర్కారు

న్యూఢిల్లీ, మే 29: పాలస్తీనాలోని రఫాపై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడి పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటనను ఖండిస్తూ, బాధితులకు సంఘీభావం తెలుపుతూ వివిధ రంగాల ప్రముఖులు, నెటిజన్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. రఫాలో ఏం జరుగుతుందో అందరూ చూడాలి అనే భావనతో.. 'ఆల్ ఐస్ ఆన్ రఫా' అనే నినాదం రాసి ఉన్న ఒక ఫొటో వైరల్‌గా మారింది. ఏఐ ద్వారా రూపొందించిన ఈ ఫొటోలో శరణార్థి శిబిరాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా #AllEyesOnRaffah అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌గా మారింది. భారత్‌లోనూ నటీనటులు వరుణ్ ధావన్, రష్మిక మందన్నా, సమంత, త్రిష, దుల్కర్ సల్మాన్, అమీ జాక్సన్, అలియా భట్, కరీనా కపూర్,




ప్రియాంక చోప్రా, సోనాక్షి సిన్హా, దియా మీర్జా, రిచా చద్దా, త్రిప్తి దిమ్రి, తదితరులు ఈ ఫొటోను షేర్ చేశారు. రఫా సురక్షిత ప్రాంతమని గతంలో ఇజ్రాయెల్ ప్రకటించింది. రఫా సురక్షితమని చెప్పి, ఆశ్రయం పొందుతున్న ప్రజలపై ఇప్పుడు దాడి చేయడం పట్ల ఇజ్రాయెల్ వైఖరిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఆదివారం రఫాలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 45 మందికి పైగా ప్రజలు మృతి చెందారు. వందల మంది గాయపడ్డారు.

**యుద్ధం ఈ ఏడాదంతా కొనసాగుతుంది**

గాజాలో హమాస్‌తో చేస్తున్న యుద్ధం ఈ ఏడాదంతా కొనసాగవచ్చని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు జాతీయ భద్రతా సలహాదారు జాచి హనేగ్బి స్పష్టం చేశారు. గాజాలో హమాస్ పాలనను అంతం చేయడం, హమాస్, దాని అనుబంధ సంస్థలు ఇజ్రాయెల్‌పై దాడి చేయకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని బుధవారం తెలిపారు. శరణార్థ శిబిరాలు ఉన్నందున రఫాపై దాడిని వెంటనే ఆపేయాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఆదేశించినప్పటికీ ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. మంగళవారం తొలిసారిగా రఫా నగరంలోకి యుద్ధట్యాంకులను పంపించింది. మరోవైపు రఫాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని అమెరికా ఖండిస్తూనే.. ఇజ్రాయెల్‌పై తమ విధానంలో మార్పు ఉండదని స్పష్టం చేసింది.